# ఆగంతకులు

శ్రీమతి వే. వినత

---

చంద్రశేఖరం:-ఒరే, అబ్బాయి మోహన్! రేపు ప్రొద్దు 9 గం.లబండీకి అక్కా-బావా వస్తున్నట్లు ఉత్తరంవచ్చింది. స్టేషనుకు వెళ్లి తీసుకురావాలి, మరినేను వెడదామంటే తీరుబడిలేదు. 7½ కల్లా ఆఫీసులో హాజరుకావాలి. కాకపోతే మా ఆఫీసరుచేత మంగళ హారతులు.

మోహన్:-సరే అట్లాగే వెడతా నాన్నా! కానీ.....

చం:-కానీ...యేమిటి?

మో:-ఏమీలేదునాన్నా. నాకు ఊహ తెలిసింతరువాత ఎప్పుడూ అక్కనీ, బావనీ చూడలేదుకదా-ఎట్లాగా అని....

చం:-ఒస్. అదాసంగతి. బావపేరు తెలుసు కద! అక్కయ్య మీ అమ్మకుమల్లేనే సన్నగా పొడుగ్గా వుంటుంది. రంగు చామనచాయ. ఒక వేళ నీవు గుర్తించక పోయినా, వసుంధరేనిన్ను గుర్తిస్తుంది-ఏమంటావు?...

మోహన్ చిన్నతనంలోనే వసుంధరకు పెళ్లయింది. కాని మామగారికీ అల్లుడికీ యేవో కొద్ది మనస్పర్థలు వచ్చి, 'ఇంక మీ అమ్మాయిని పుట్టింటికి పంప'నని గట్టిగా చెప్పేశాడు అల్లుడు. తిరిగి పదేళ్ల అనంతరం ఇప్పుడు రాక.

మరుసటి రోజు ప్రొద్దున -

మో:-అమ్మా? నేను యివాళ తలంటి పోసుకుంటానే-

తల్లి:-ఆ, ఎంతమాట! (తనలో ఎప్పుడూ నేను ఎంత బ్రతిమాలుకున్నా రాని వాడికి ఇవాళ ఇదేంబుద్ధట) తప్పకుండా పోసుకో ఇంతకంటె యింకేంకావాలి!

మో:-అది కాదే మరి అక్కయ్యవస్తోంది కదూ అందుకని.

మోహన్ తలంటి పోసుకొని కొత్త బట్టలేసుకుని హడావిడిగా 7¼ గం.లకే స్టేషకువెళ్లాడు.

(మోహన్ తనలో)'వెధవది టైము దబ్బునవుతే బాగుండును' అనుకుంటూ పక్కనేవున్న హోటలుకు వెళ్లి ఇడ్డెన్లు కాఫీ తీసుకుని హిగిన్ బాదమ్స్ పుస్తకశాలకు వెళ్లి, చందమామ, కినిమా కొని పావు గంటలో చదివేశాడు. వాస్తవానికి ఇవి చదవటానికి చాలా టైంమ్ పట్టినా, ఇప్పుడు మాత్రం చాలా త్వరగా చదివేశాడు. ఇంక ట్రైన్ రావడానికి పదినిమిషాలు వున్నది. యీలోపల ఎంక్వైరీ ఆఫీసుకు వెళ్లికనుకున్నాడు ట్రైన్ ఎన్నిగంటలకు వస్తుందని. అక్కడ ఆఫీసరు పదినిమిషాలు లేటని చెప్పింది. మోహన్ విని 'తస్సాదియ్యా'అనుకుని చదివినవే తిరిగి తిరగేస్తూ

కూర్చున్నాడు. రైలువచ్చింది. స్టేషను నిశ్శబ్దంగా వున్నదల్లా ఒక నిమిషంలో గందరగోళమైపోయింది. కూలీ, కూలీ అంటూ రైలు చుట్టూ మూగారు. అప్పుడే రైలు పెట్టెలోంచి దిగుతున్న దంపతులను చూచి నాన్న చెప్పిన పోలిక గుర్తించి "ఆ .. మీ పేరేమిటండి?"

ఆయన:—నా పేరా! సుబ్రహ్మణ్యం. నీ పేరేమిటబ్బాయి?

మో:—నా పేరా! మీకు తెలియదూ!— మోహన్. ఇదివరకు నేనెప్పుడూ చూడలేదు. ఇదే చూడటం అక్కయ్యా! మిమ్మల్ని.

ఆవిడ —సరేకానీ, మాకూ యీవూరు ఇదే క్రొత్త – ఎట్లాగా అనుకుంటూ వుంటే నీవు కనపడ్డావు. చాలా సంతోషము తమ్ముడూ!

ఆయన:—మీరు ఎక్కడవుంటున్నారు?

మో:-మేము నారాయణపేటలో వుంటున్నామిప్పుడు. పాతఇంట్లోంచి మారి వారం రోజులైంది.

ఆ:-హోటలు ఎక్కడవుంది? భోంచేసి వెడదాం.

మో:—వద్దండీ–ఇంటిదగ్గర చేయవచ్చుగా– టాక్సీని పిలుస్తారండీ.

అంతా ఇంటికి వచ్చారు.

తల్లిరాకరాక అల్లుడువచ్చాడన్న సంతోషంతో వాకిట్లోకి చెంబుతో నీళ్లు తీసుకువచ్చి ఆశ్చర్యపోయింది. చాటుగా అబ్బాయినిపిలిచి, వీళ్లెవరురా మోహన్? అక్కయ్యావాళ్లుయేరి?

మో:—తెల్లపోయి. అమ్మా! ఆవిడ అక్కయ్యకాదూ! . ఆయనపేరడిగితే సుబ్రహ్మణ్యం అని చెప్పారే – ఆవిడిని అక్కయ్యా అంటే తమ్ముడూ అని పిలిచిందే!

తల్లి:—సరేకానీ, అఘోరించావులే. వాళ్లను వచ్చి స్నానం చేయమని చెప్పు.

[ఆయన లోపలకు వస్తూ,]

"నమస్కారమండీ. మేము యాత్రలకని బయలుదేరి ఒక్కొక్క వూరే చూసుకొంటు వస్తున్నాము. ఈ ఊరు మాకుక్రొత్త ఇదే రావటం. ఎట్లాగా అనుకుంటూవుంటే మోహన్ కనిపించాడు. నిజంగా... తమ్ముడుకంటే ఎక్కువగా ఆప్తుడైనాడు— భోజనం చేసి వెడదామంటే ఇంటికివచ్చి చేయవచ్చునని తీసుకువచ్చాడు.

తల్లి:—ఈ రైల్లోనే, అమ్మాయీ, అల్లుడూ వస్తామని వ్రాశారు. వాళ్లనాన్నగారికి తీరుబడిలేక అబ్బాయిని స్టేషనుకు పంపారు. అమ్మాయి అచ్చం మా అమ్మాయిలాగానేవుంది. మోహన్ పొరపడ్డాడు' అంది. ఇంతలో చంద్రశేఖరంగారు వచ్చారు. జరిగిన సంగతంతావిని నవ్వుకున్నారు మోహన్

చేసినపనికి.

అల్లుడి హోదాలో, పిండివంటలతో కమ్మగా భోజనంచేసి ఆదంపతులిద్దరూ వాత్సల్యంతో "వెళ్ళొస్తాం... మీరుచేసిన సత్కారానికి మేమెంతో కృతజ్ఞులం, మీ మేలు ఎన్నటికీ మరువరానిది" అంటూ లేచారు. పోస్టుమాన్ పోస్టు అంటూ ఉత్తరం పడేశాడు.

చంద్రశేఖరంగారు ఉత్తరం పైకి చదువుతారు. ఆదుర్దాగా......

శ్రీ మామగారికి,

నమస్కారములు. నిన్న బయలుదేరుదామని ఉత్తరమువ్రాశాము, కాని మా ఆఫీసరు హఠాత్కరణమువల్ల రాలేక పోయినాను. వారం పదిరోజులలో సెలవు చూచుకొని వస్తాం. మోహన్‌ని అడిగి నానని చెప్పండి!

భవదీయుడు

సుబ్రహ్మణ్యాం

ఆ, ఆగంతకులు సుష్టుగా భోంచేసి వచ్చిందారినే తిరిగివెళ్ళారు –

చం:–అసలు ఇంతకీ వాళ్లకు ఎప్పుడో మనము ఋణపడివున్నాము (అంటూ నిట్టూర్చారు.)

